సాక్షి నల్లగొండ

మంగళవారం ¦ 21 ¦ మార్చి ¦ 2023



నక్సలైట్ల పేరుతో బెదిరింపులు

నక్సలైట్ల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని మిర్యాలగూడ పోలీసులు పట్టుకున్నారు. - 8లో



లీకేజీపై విచారణ జరిపించాలి

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని మాజీ మంత్రి జానారెడ్డి డిమాండ్ చేశారు. - 10లో

గరిష్టం/కనిష్టం 35°/22°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీలో అప్రెంటిషిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ రూరల్ : ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి ఆర్టీసీలో అప్రెంటిషిప్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్‌ఎం శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో డీజిల్ మెకానిక్ ట్రేడ్ పూర్తి చేసిన వారు ఏప్రిల్ 4వ తేదీలోగా ఆర్టీసీ నల్లగొండ లోకేషన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 7 డిపోల్లో అప్రెంటిషిప్ శిక్షణ ఇస్తామని తెలిపారు.

ప్రతి ఫిర్యాదుపై సమగ్ర దర్యాప్తు చేయాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : ప్రతి ఫిర్యాదుపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ అపూర్వరావు కింది స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డే సందర్భంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని, ఎలాంటి ఒత్తిడికి లొంగకుండా బాధితులకు చట్టపరంగా న్యాయం చేయాలని సూచించారు. కుటుంబ సమస్యలు, భూమి వివాదాలు శాంతి భద్రతల సమస్యగా మారకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

753 మంది గైర్హాజరు

నల్లగొండ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మ్యాథ్స్, బోటని, పొలిటికల్ సైన్స్ పరీక్షలకు సోమవారం 753 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 16,091 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా.. 15,338 మంది పరీక్ష రాశారు. జిల్లావ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

కేసీఆర్ నేతృత్వంలో నల్లగొండ అభివృద్ధి

- రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్



ఆల్బమ్‌ను వీక్షిస్తున్న గౌరీశంకర్, ఎమ్మెల్యే

నల్లగొండ : నీలగిరి పట్టణంలో 60 ఏళ్లలో జరుగని అభివృద్ధి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు దార్శనికత, ఆలోచనలు, ఆదేశాలకనుగుణంగా ఇప్పుడు జరుగుతోందని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. సోమవారం నల్లగొండలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్మించనున్న నీలగిరి కళాభారతి, పానగల్ ట్యాంక్ బండ్, వల్లభరావు చెరువు అభివృద్ధి, రహదారుల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి అద్భుతంగా జరుగుతోందని పేర్కొన్నారు.

పన్నులు వసూలైతే అదనపు నిధులు

నకిరేకల్ : మున్సిపాలిటీలో ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేస్తే.. పట్టణ అభివృద్ధికి కోసం అదనంగా నిధులు మంజూరవుతాయని మెప్మా పీడీ, రెవెన్యూ ప్రత్యేక అధికారి శ్రీపాద రామేశ్వర్ పేర్కొన్నారు. నకిరేకల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆస్తి పన్ను వసూళ్ల పురోగతిపై ఆయన సమీక్షించారు. ప్రస్తుత సంవత్సరంలో రూ.9.52 కోట్ల లక్ష్యానికిగాను, ఇప్పటి వరకు రూ.3.58 కోట్లు వసూలయ్యాని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ బాలాజీ, 1వ వార్డు కౌన్సిలర్ రాచకొండ సునిల్‌గౌడ్ పాల్గొన్నారు.

24న 'చలో విద్యుత్ సౌధ'

నల్లగొండ : ఈ నెల 24న చేపట్టిన చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎన్.వెంకటయ్య, కన్వీనర్ ఏ.నాగిరెడ్డి, వైస్ చైర్మన్ ఎం.సురేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు రూపొందించిన వాల్ పోస్టర్‌ను సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లగొండ సర్కిల్ ఆఫీస్ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు తక్షణమే పీఆర్సీ, ఈపీఎఫ్ ప్రకటించడంతో పాటు ఆర్టిజన్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బషీర్, శ్రీనివాస్, సీహెచ్.రాజు, ఎన్.శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, ఏ.వెంకటేశం, రాంబాబు, పి.వెంకటేశ్వర్లు, బాలు, దీప్తి, సంధ్య, యాదగిరి, ఏ.పాండు పాల్గొన్నారు.

గుర్రంపోడు లిఫ్ట్ లేనట్టే!

- ముఖ్యమంత్రి ప్రకటించినా అమలుకు నోచని ఎత్తిపోతల పథకం
- డిండి లిఫ్ట్ పరిధిలోకి వస్తుందని ప్రతిపాదనల తిరస్కరణ
- ఎగువ గ్రామాల రైతుల ఆశలు ఆవిరి
- నత్తనడకన పాల్వాయి లిఫ్ట్ పనులు



గుర్రంపోడు ఎత్తిపోతల పథకం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ ఎగువ గ్రామాలకు సాగునీరందించే గుర్రంపోడు ఎత్తిపోతల పథకానికి అధికారులు మంగళం పాడారు. 2021 ఆగస్టులో సీఎం కేసీఆర్ హాలియాలో జరిపిన సమీక్ష సమావేశంలో గుర్రంపోడు ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఈ ప్రాంతంతోని రైతుల్లో ఆశలు చిగురించాయి. అధికారులు ప్రతిపాదనలు రూపొందించి చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి పంపించగా డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోకి ఈ ఆయకట్టు వస్తుందని గుర్తించారు. ఈ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయలేమని ఇక్కడి అధికారులకు సమాచారం అందించారు.

40 శాతం భూమి కాల్వ పైభాగంలోనే..

సాధారణంగా కాల్వల్లో దిగువన ఆయకట్టుకు మాత్రమే సాగునీరు అందుతుంది. ప్రధాన కాల్వ పక్కనే ఉన్న ఎగువ భాగంలో ఉన్న భూములకు నీరందే అవకాశం ఉండదు. మండలంలో 22 కిలోమీటర్ల పొడవున గల ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు దిగువన 60 శాతం, ఎగువన 40 శాతం భూ భాగం ఉంది. ఎగువ గల 40 శాతం భూములకు సాగునీరు అందాలంటే ఎత్తిపోతల పథకాలే శరణ్యం. గుర్రంపోడు లిఫ్ట్ మంజూరైతే కొండాపురం, తేనపల్లి, ముల్కలపల్లి, పోచంపల్లి, ఉట్లపల్లి, వట్టికోడు తదితర గ్రామాల్లోని 28 చెరువులు నింపడంతోపాటు పదివేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని అంచనా వేశారు. అయితే డిండి ఎత్తిపోతల పథకం విషయంలో ఈ ప్రాంతంలో భూసేకరణ, కాల్వల డిజైన్ లాంటి పనుల ఊసే లేనందు. దీంతో తమ భూములకు సాగునీటి కోసం ఎదురుచూపులు తప్పేలా లేవని రైతులు దిగాలు చెందుతున్నారు.

పునాది దశలోనే పాల్వాయి లిఫ్ట్

గుర్రంపోడు మండలంలో మరో ఎత్తిపోతల పథకమైన పాల్వాయి లిఫ్ట్ ఇంకా పంపు హౌజ్ పునాది నిర్మాణ దశలోనే ఉంది. పీఏపల్లి మండలం అక్కంపల్లి వద్ద పంపుహౌజ్ నిర్మించి ఈ ప్రాంతంలోని పాల్వాయితోపాటు మక్కపల్లి, కాల్వపల్లి, పాశం వారిగూడెం తదితర గ్రామాల చెరువులకు పైపు లైన్ ద్వారా నీరందించాల్సి ఉంది. నెల్లికల్లు లిఫ్ట్ ఇరిగేషన్‌లో అంతర్భాగంగా మంజూరైన పాల్వాయి ఎత్తిపోతల పథకం మంజూరై రెండేళ్లు గడుస్తున్నా మండల పరిధిలో పనులే ప్రారంభం కాకపోవడంతో.. ఎప్పటికి పూర్తవుతుందోనని స్థానికులు అంటున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తెచ్చి పనులు వేగవంతమయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



పాల్వాయి లిఫ్ట్ పంప్ హౌజ్ పనులు

లిఫ్ట్ మంజూరు చేయలేదు



గుర్రంపోడు లిఫ్ట్ ఇరిగేషన్‌కు సర్వే చేసి చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి ప్రతిపాదనలను పంపించాం. ఐతే ఈ ఎత్తిపోతల ఆయకట్టు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులోకి వస్తుందని మళ్లీ మరో లిఫ్ట్ స్కీం మంజూరు చేయలేమని అధికారులు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతానికి గుర్రంపోడు లిఫ్ట్‌కు మోక్షం లేనట్లే.

– ఆనందరావు, ఏఎమ్మార్పీ డివిజన్ ఈఈ

లిఫ్ట్ మంజూరయ్యేలా చూస్తాం..



గుర్రంపోడు లిఫ్టను మంజూరు చేయాలని ఎమ్మెల్యే, మంత్రి దృష్టికి తీసుకెళ్లి.. మంజూరయ్యేలా చూస్తాం. పక్కనే ప్రధాన కాల్వ ఉన్నందున గుర్రంపోడు లిఫ్ట్ ద్వారా ఈ ప్రాంత ఎగువ గ్రామాలకు నీరందించడం సులభంగా ఉంటుంది.

– పూల సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకుడు పోచంపల్లి

సీఎం హామీని నెరవేర్చాలి



గుర్రంపోడు లిఫ్ట్ మంజూరు చేస్తునట్లు సీఎం కేసీఆర్ ప్రకటించినందున ఇక్కడి రైతులు సంబరపడ్డారు. తీరా లిఫ్ట్ స్కీం మంజూరుకే మోక్షం లేకపోవడం ఆశలపై నీళ్ల చల్లినట్లయ్యింది. గుర్రంపోడు లిఫ్ట్ ఏర్పాటు చేయాలి.

– గుత్తా తిరుమల్‌రెడ్డి సర్పంచ్ పోచంపల్లి

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ: ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను వాటిని సత్వరం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి జిల్లా అధికారులంతా హాజరుకావాలని, ఫిర్యాదుదారుల సమస్యను పరిశీలించి అవగాహన చేసుకోవాలని సూచించారు. సోమవారం ప్రజావాణిలో భూ సంబంధిత సర్వే సమస్యలు, పింఛన్ల దరఖాస్తులు, అంగ వైకల్యం ధ్రువీకరణ పత్రాలు, ఎస్సీ అభివృద్ధి శాఖ, ఎక్సైజ్, ఇతర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, పరిశ్రమల శాఖ జీఎం కోటేశ్వరరావు ఉన్నారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

రామగిరి(నల్లగొండ) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి నిర్వహించనున్న టెన్త్ పరీక్షల ఏర్పాట్లపై సోమవారం నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాలలో నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. సందర్భంగా పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, ప్రశ్నపత్రాల కస్టోడియన్లకు ఆయన పలు సూచనలు చేశారు. ఎస్‌ఎస్‌సీ బోర్డు జారీ చేసిన సూచనల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. కోవిడ్ దృష్ట్యా 11 పేపర్లను 6 పేపర్లకు కుదించారని తెలిపారు. డీఈఓ బిక్షపతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 107 పరీక్ష కేంద్రాల్లో 19,414 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుతారని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళిక రూపకల్పనకు సమావేశం


నల్లగొండ : 15వ ఆర్థిక సంఘం జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు సోమవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమన్వయ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఎన్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ జి.కాంతమ్మ, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

ఆమెకు 'ఆసరా'

- పింఛన్ పొందుతున్న భర్త చనిపోయిన 15 రోజుల్లోనే భార్యకు మంజూరు
- గతేడాది ఆగస్టు నుంచి 408 మందికి లబ్ధి
- మిగతా పింఛన్ల కోసం ఆన్‌లైన్‌లో కనిపించని ఆప్షన్లు



నల్లగొండ : ప్రభుత్వ ఆసరా పింఛన్ పొందుతున్న భర్త చనిపోయిన 15 రోజుల్లోనే ప్రభుత్వం భార్యకు పింఛన్ మంజూరు చేస్తోంది. భాగస్వామి చనిపోయిన వెంటనే అన్ని ఆధారాలతో దరఖాస్తు చేసుకున్నవారికి పింఛన్ అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత సంవత్సరం ఆగస్టు మాసం వరకు అన్ని రకాల పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవారికి మంజూరు చేశారు. ఆ తర్వాత కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో ఆప్షన్ తొలగించారు. కేవలం పింఛన్ పొందుతున్న భర్త చనిపోయిన వారికి పింఛన్ దరఖాస్తు ఆప్షన్ ఒక్కటే అందుబాటులో ఉంచారు. అప్పటి నుంచి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పింఛన్ మంజూరు చేస్తున్నారు. దీంతో గతేడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 408 మంది మహిళలకు లబ్ధి చేకూరింది.

ఆన్‌లైన్‌లో కనిపించని మిగతా పింఛన్ల ఆప్షన్లు

వృద్ధులు, వితంతువులు చాలా మంది ఆసరా పింఛన్ మీద ఆధారపడి పేదల జీవనం సాగిస్తున్నారు. కొందరికి పిల్లలు లేకపోవడం, మరికొందరికి పిల్లలు ఉన్నా వారిని పోషించే స్థోమత లేకపోవడంతో, కొందరిని పట్టించుకోకపోవడం వంటి ఘటనలు ఉన్నాయి. వారికి ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్ భరోసా ఇస్తోంది. అయితే ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, బోధకాలు తదితర పింఛన్లు ఇస్తుంది. కానీ, భర్త చనిపోయిన వారి విషయంలో కాకుండా ఇతర పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఏడాదిలో ఒకటి, రెండు సార్లు ఆన్‌లైన్‌లో అవకాశం కల్పిస్తుంది. ఆ తర్వాత ఎప్పుడో ఒకసారి వారికి పింఛన్ మంజూరు చేస్తుంది.

దరఖాస్తు చేయడం ఇలా..

భర్త మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్‌కార్డును పింఛన్ దరఖాస్తుకు జతచేసి గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యదర్శికి, పట్టణాల్లో అయితే మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలి. వారు అన్ని పరిశీలించి ఆన్‌లైన్ చేసి ఉన్నతాధికారులకు పంపుతారు. వెంటనే ఆ ప్రక్రియ పూర్తయి భార్యకు పింఛన్ మంజూరు అవుతుంది. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఈ విధానం వల్ల జిల్లాలో ఇప్పటికే పింఛన్ పొందుతున్న భర్తలు చనిపోయిన భార్యలకు 57 ఏళ్లు ఉంటే వృద్ధాప్య పింఛన్ కింద.. తక్కువ వయస్సు ఉంటే వితంతు పింఛన్‌ను మంజూరు చేస్తున్నారు.

42 రోజుల్లో.. 52 శాతం మందికి..

- ముమ్మరంగా సాగుతున్న 'కంటి వెలుగు'
- వారంలో ఐదు రోజుల పాటు పరీక్షలు
- 74 బృందాల ఆధ్వర్యంలో శిబిరాలు
- వంద రోజుల్లో పూర్తి చేసేలా ముందుకెళ్తున్న వైద్య ఆరోగ్య శాఖ



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యబృందం

నల్లగొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. 18 ఏళ్ల పైబడిన వారందరికీ వంద రోజుల్లో కంటి పరీక్షలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ముందుకెళ్తున్నారు. శిబిరాలు ప్రారంభించిన రోజు నుంచి పరీక్షలు చేసిన 42 రోజుల్లో ఇప్పటి వరకు 52 శాతం మందికి కంటి పరీక్షలు పూర్తి చేశారు.

రెండు నెలల నుంచి..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 74 బృందాలను ఏర్పాటు చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఈ ఏడాది జనవరి 19న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొత్తం 844 గ్రామ పంచాయతీలు, 182 మున్సిపల్ వార్డుల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేసింది. రెండు నెలల నుంచి శని, ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాలను మినహాయించి వారంలో ఐదు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో వృద్ధులు, మహిళలను దృష్టిలో పెట్టుకొని శిబిరాల వద్ద తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు 377 పంచాయతీలు, 85 మున్సిపల్ వార్డుల్లో కంటి పరీక్షలు చేశారు. రీడింగ్ అద్దాలు అవసమున్న వారికి అందజేస్తున్నారు. అవసరం లేనివారికి మందులు మాత్రమే అందిస్తున్నారు. కొందరికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు రాస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం పంపిన ప్రిస్క్రిప్షన్ అద్దాలను సైతం పేర్లు నమోదైన వారికి అందించారు. కొందరికి రావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలను ప్రాంతాల వారీగా నిర్వహిస్తుండడం, అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు అందజేస్తున్న నేపథ్యంలో ప్రజలు పెద్ద ఎత్తున కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు.



కంటి పరీక్షల వివరాలు..

కంటి వెలుగు బృందాలు	చేసిన పరీక్షలు
74	3,77,214
వచ్చిన రీడింగ్ అద్దాలు	పంపిణీ చేసినవి
1,22,030	56,817
వచ్చిన ప్రిస్క్రిప్షన్ అద్దాలు	పంపిణీ చేసినవి
18,294	16,337

ప్రజల నుంచి స్పందన బాగుంది



జిల్లాలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన బాగుంది. కంటి పరీక్షలు చేయించుకునేందుకు శిబిరాలకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. అవసరం ఉన్నవారికి వెంటనే రీడింగ్ అద్దాలు ఇస్తున్నాం. ప్రిస్క్రిప్షన్ అద్దాలు అవసరం ఉన్న వారికి ఆర్డర్ ఇచ్చి తెప్పించి వారి ఇళ్లకు పంపిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీ సంఘటనకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలో విషయంలో పూర్తిస్థాయి విచారణ జరిపించి నిజానిజాలను తేల్చాలన్నారు. విద్యార్థులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉపాధి పనులకు రావాలని ప్రచారం



శ్రీనివాస్ నగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

- రాత్రివేళ గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పిస్తున్న మిర్యాలగూడ ఎంపీడీఓ

మిర్యాలగూడ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కల్పించే పనులకు కూలీలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరుతూ మిర్యాలగూడ ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో సోమవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. కూలీలు పగటి పూట వ్యవసాయ పనులకు వెళ్లి అందుబాటులో ఉండరన్న ఆలోచనతో రాత్రి వేళ గ్రామాల్లో ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ఇప్పటివరకు మండలంలోని ఐదు తండాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ ఐటీఐలో షార్ట్ టర్మ్ కోర్సులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ప్రభుత్వ (బాలుర) ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా షార్ట్ టర్మ్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండి, 8, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు కోర్సులకు దరఖాస్తు చేసుకోడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు pmkvy. skillindia.gov.in/home వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రచార జాతాలను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద పాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టే ప్రచార జాతాలు, పాదయాత్రలను జయప్రదం చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీకి వ్యతిరేకంగా ఏప్రిల్ 14 నుంచి 'బీజేపీకు హటావో దేశ్‌కి బచావో' నినాదంతో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి రోజున జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారజాతాలు, పాదయాత్రలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, బి.వెంకటరమణ, పబ్బు వీరస్వామి, అంజాచారి, జి.రామచంద్రయ్య, టి.వెంకటేశ్వర్లు, బొలుగూరి నర్సింహ, రమ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

క్లుప్తంగా

భూమి తీసుకున్నారు.. అన్నం పెట్టడం లేదు


పంతంగి లింగయ్య

నల్లగొండ టూటౌన్ : తన పేరిట ఉన్న భూమిని తనకు తెలియకుండా ఇద్దరు కుమారులు రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఇప్పుడు కనీసం పట్టెడు అన్నం కూడా పెట్టడంలేదని మునుగోడు మండలంలోని పలివెల గ్రామానికి చెందిన పంతంగి లింగయ్య సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఆర్డీఓ జయచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశాడు. ఇదే విషయమై 2021లో ఆర్డీఓకు విన్నవించగా.. మూడుసార్లు తన కుమారులకు కౌన్సిలింగ్ ఇచ్చారని, అయినా వారిలో మార్పురాలేదని కలెక్టర్‌కు వివరించాడు. వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తనను, తన భార్యను కుమారులు నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని, వారి నుంచి పోలీస్ రక్షణ కల్పించి, తమ భూమిని తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

అటవీ సిబ్బందిపై దాడి

- ఒకరి తలకు గాయం
- నిందితులపై కేసు నమోదు

పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్‌దర్గా పరిధిలోని పసుపుబోడు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఆదివారం రాత్రి అటవీ ఆక్రమణదారులు ఫారెస్ట్ బీట్ బేస్ క్యాంపు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పసుపుబోడు రిజర్వ్ ఫారెస్ట్‌లో కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారనే సమాచారం అందడంతో ఆదివారం రాత్రి ఫారెస్ట్ బేస్ క్యాంపు సిబ్బంది షేక్ రియాజ్, భూక్యా సైదులు అక్కడకు చేరుకుని ఆక్రమణలను అడ్డుకున్నారు. దీంతో ఫారెస్ట్ సిబ్బందిపై ఆక్రమణదారులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రియాజ్ తలకు గాయమైంది. దీంతో వారు ఫారెస్ట్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం హుజూర్‌నగర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి గౌతమ్ ఘటనకు గల కారణాలను తెలుసుకుని దాడికి పాల్పడిన రావిపహాడ్ గ్రామానికి చెందిన కల్లేటి సైదులు, కల్లేటి అంజి జాన్‌పహాడ్‌దర్గాకు చెందిన లకావత్ నరసింహ, మఠంపల్లి మండలం బొజ్యగూడెం గ్రామానికి చెందిన గుగులోతు శ్రీనుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

నక్సలైట్ల పేరుతో బెదిరింపులు

- పోలీసులను ఆశ్రయించిన వ్యాపారి
- వలపన్ని పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ అర్బన్: గతంలో జనశక్తిలో కొరియర్‌గా పనిచేసి పోలీసులకు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశాక ఈజీగా డబ్బులు సంపాదించాలనే తలంపుతో నక్సలైట్ పేరును ఉపయోగించుకుని పలు నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు పట్టుకున్నారు. మిర్యాలగూడ డీఎస్పీ పి.వెంకటగిరి వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనా రావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్ 1996 నుంచి 1998 వరకు జనశక్తి గ్రూపులో పని చేసి అప్పట్లోనే పోలీసులకు లొంగిపోయాడు. దీంతో పోలీసులకు ఇన్ఫార్మర్‌గా పనిచేస్తున్నాడని జనశక్తి సభ్యులు గతంలో రెండుసార్లు సుదర్శన్‌రెడ్డిపై దాడికి ప్రయత్నించగా తప్పించుకున్నాడు. ఈ క్రమంలో తనకు ప్రాణహాని ఉందనే నెపంతో 2002లో లైసెన్స్‌డ్ తుపాకీ పొందాడు. హైదరాబాద్‌లోని హబ్సిగూడలో నివాసముంటున్నాడు. ప్రైమ్ కన్‌స్ట్రక్షన్ పేరుతో హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్లు నిర్మించి అమ్ముతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడంతో ఆ వ్యాపారంలో భారీగా నష్టం వచ్చింది. వ్యాపార లావాదేవిల్లో అధిక వడ్డీకి అప్పులు తేవడంతో వారి వేధింపులు ఎక్కువ కావడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనకు వచ్చాడు. మొగుళ్లపల్లి కృష్ణమూర్తి అనే వ్యక్తితో కలిసి పెద్దపల్లి, సుల్తానాబాద్, హనుమకొండ, కరీంనగర్‌లలో బడా రైస్‌మిల్ వ్యాపారుల వివరాలు తెలుసుకుని మావోయిస్టు పార్టీకి ఫండ్స్ ఇవ్వాలని తుపాకీతో బెదిరించి డబ్బులు తీసుకోవడంతో పలు కేసులు నమోదై జైలుకు కూడా వెళ్లొచ్చాడు. అయినా తన తీరులో మార్పు తెచ్చుకోకపోగా దొంగతనాలకు పాల్పడి కూడా తిరిగి జైలుకు వెళ్లొచ్చాడు. అనంతరం మేడ్చల్ జిల్లా కాప్రా మండలం అంబేద్కర్‌నగర్‌కు చెందిన సుంచు మల్లేష్ పరిచయం అయ్యాడు. సుదర్శన్‌రెడ్డి బెదిరింపుల ద్వారా వసూలు చేసిన డబ్బులను సుంచు మల్లేష్‌కు ఫోన్ పే చేయించడం ఇద్దరు వాటాలు పంచుకోవడం జరుగుతుంది. ఈ దశలో మిర్యాలగూడ పట్టణానికి చెందిన రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ కు ఫోన్‌చేసి.. తాము నక్సలైట్లమని, తక్షణమే రూ.5లక్షలు ఇవ్వకుంటే కుటుంబ సభ్యులను చంపుతామని సుంచు మల్లేష్, సుదర్శన్‌రెడ్డి బెదిరించారు. దీంతో వారి బెదిరింపులకు భయపడిన శ్రీనివాస్ ఈ నెల 18న సుంచు మల్లేష్ కు రూ.10వేల రూపాయలను ఫోన్ పే చేశారు. మిగిలిన డబ్బులను అంత డబ్బును ఫోన్ పే చేయడం కుదరదని మీరే వచ్చి తీసుకోవాలని వారితో వ్యాపారి చెప్పాడు. ఈ విషయం వెంటనే శ్రీనివాస్‌కు పోలీసులకు చెప్పాడు. మల్లేష్, సుదర్శన్‌రెడ్డిలు డబ్బుల కోసం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌కు రావడంతో ముందే అక్కడ మాటు వేసిన పోలీసులు వలపన్ని వారిని పట్టుకున్నారు. విచారణలో తాము చేసిన నేరాలను అంగీకరించడంతో ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ఒక స్మార్ట్ ఫోన్, ఒక కీ ప్యాడ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ రాఘవేందర్, టూటౌన్ ఎస్‌ఐలు ఏ.సైదిరెడ్డి, ఎస్.కృష్ణయ్య, హెడ్ కానిస్టేబల్ కె.లక్ష్మయ్య, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, రామకృష్ణలను డీఎస్పీ అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

- చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం వద్ద న్యాయవాది..
- పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద మరొకరు

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో న్యాయవాది అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన సముద్రాల పృథ్వీ చక్రవర్తి(53) న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. స్నేహితుడి తండ్రి దశదినకర్మ కోసం ఆదివారం ఉదయం సూర్యాపేట జిల్లా పరిధిలోని తుంగతుర్తికి వెళ్లాడు. అక్కడి నుండి రాత్రి తిరిగి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో దండుమల్కాపురం గ్రామ శివారులోని ఇండస్ట్రియల్ పార్కు పైలాన్ దాటాక మూత్రవిసర్జన కోసం కారును రోడ్డు పక్కన ఆపాడు. మూత్రవిసర్జన చేసి తిరిగి కారు ఎక్కుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆయనను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావ కృష్ణ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.


రాంరెడ్డి (ఫైల్)

మినీ బస్సు ఢీకొని..

పెద్దఅడిశర్లపల్లి: మినీ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై అంగడిపేట ఎక్స్ రోడ్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం భారత్‌పురం గ్రామానికి చెందిన చాట్లపర్తి రాంరెడ్డి(65) సోమవారం తన ద్విచక్ర వాహనంపై అంగడిపేట ఎక్స్ రోడ్ వద్దకు వచ్చి కిరాణా సరుకులు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోయించేందుకు అంగడిపేట ఎక్స్ రోడ్ సమీపంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్‌లోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పెద్దవూర నుంచి వస్తున్న మినీ బస్సు ఢీకొట్టింది. దీంతో రాంరెడ్డికి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 25 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

యాదగిరిగుట్ట రూరల్: కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతిచెందిన సంఘటన యాదగిరిగుట్ట మండల పరిధిలోని దాతర్‌పల్లి మధిర గ్రామమైన మైలార్‌గడ్డతండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌గడ్డతండా గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ధీరావత్ నర్సింహ ఆదివారం రాత్రి తన గొర్రెలను వ్యవసాయ బావి వద్ద ఉన్న పాకలోకి తోలి ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం వచ్చి చూడగా కుక్కలు దాడిలో 25 గొర్రెలు మృత్యువాత పడి కనిపించాయి. చనిపోయిన గొర్రెల విలువ సుమారు రూ.2.50లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఎంపీపీ చీర శ్రీశైలం, జెడ్పీటీసీ సభ్యురాలు తోటకూరి అనురాధ, ఎంపీడీఓ నర్సింహ తండాకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నర్సింహకు న్యాయం చేయాలని కోరారు. వారి వెంట ఎంపీటీసీ కాల్నె అయిలయ్య, ఉప సర్పంచ్ కాల్నె భాస్కర్, వార్డు సభ్యురాలు ధీరావత్ సరోజ ఉన్నారు. అదేవిధంగా తండాలో నాలుగు రోజుల క్రితం కూడా తమ 18 గొర్రెలను కుక్కలు దాడి చేసి చంపేశాయని గొర్రెల కాపరులు గూగులోత్ కిషన్, ధీరావత్ మహేందర్ తెలిపారు.

తంగడపల్లిలో 18 గొర్రెలు అపహరణ

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి గొర్రెలను చోరీ చేశారు. వివరాలు.. తంగడపల్లి గ్రామానికి చెందిన మాంసం విక్రయదారుడు జావేద్ 18 గొర్రెలను హైదరాబాద్‌లో కొనుగోలు చేసి తీసుకొచ్చి ఆదివారం రాత్రి ఇంటి పక్కనే ఉన్న దొడ్డిలో కట్టేశాడు. సోమవారం తెల్లవారుజామున వెళ్లి చూడగా గొర్రెలు కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా గొర్రెలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్కూల్ బస్సు కిందపడి విద్యార్థి మృతి

- వేగంగా వెళ్తున్న బస్సు కుదుపులకు డోర్ నుంచి కిందపడిన విద్యార్థి
- బస్సు వెనక చక్రాలు అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి


అభిలాష్ (ఫైల్)


అభిలాష్ మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి శ్రీనివాస్, అభిలాష్ అన్న మల్లికార్జున్

భూదాన్‌పోచంపల్లి: మమ్మీ బైబై.. అంటూ స్కూల్‌కు వెళ్లిన చిన్నారి కానిరాని లోకాలకు వెళ్లిపోయాడు. స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి చిన్నారి మృతికి కారణమయ్యాడు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని హైదర్‌పూర్ గ్రామానికి చెందిన వడ్డేమోని శ్రీనివాస్, రాణి దంపతులకు మల్లికార్జున్, అభిలాష్(8) ఇద్దరు కుమారులతో పాటు కుమార్తె వర్షిత ఉన్నారు. వీరంతా మండల కేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో చదువుతున్నారు. మల్లికార్జున్ 5వ తరగతి, అభిలాష్ ఒకట తరగతి, వర్షిత ఎల్‌కేజీ చదువుతుంది. ఉదయం అందరూ రెడీ అయి స్కూల్‌కు వెళ్లారు. ఒంటిపూట బడులు కావడంతో స్కూల్ వదిలిన తరువాత తిరిగి స్కూల్ బస్సు ఎక్కి ఇంటికి బయలుదేరారు.

వేగంగా వెళ్తున్న బస్సులో నుంచి జారి..

స్కూల్ నుంచి బయలుదేరిన బస్సు.. ఆయా గ్రామాలలో పిల్లలను దింపుతూ చివరగా హైదర్‌పూర్‌కు వెళ్తుంది. బస్సులో 10 మంది వరకు విద్యార్థులున్నారు. ఈ క్రమంలో భీమనపల్లి గ్రామం దాటిన తరువాత బస్సు డ్రైవర్ జింకల రాము అతివేగంగా బస్సును నడిపాడు. గ్రామశివారులోని చెరువు దాటిన తరువాత మూలమలుపు వద్ద కుదుపునకు బస్సులో ఉన్న అభిలాష్ కదులుతున్న బస్సులోంచి జారి కింద పడగా, బస్సు వెనుక చక్రాలు అతనిపై నుంచి వెళ్లింది. విద్యార్థి బస్సులోంచి పడిపోయిన విషయాన్ని డ్రైవర్ కనీసం చూడకుండానే వేగంగా అలానే ముందుకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో భీమనపల్లి గ్రామానికి చెందిన ముంత కృష్ణ అనే వ్యక్తి బైక్‌పై వస్తూ విద్యార్థి కిందపడిపోవడాన్ని గమనించి కొద్దిదూరం వెళ్లిన బస్సును ఆపాడు. అందరూ కలిసి అక్కడికి వెళ్లి చూడగా అభిలాష్ రక్తపుమడుగులో విగతజీవిగా మారాడు.

బస్సు డోర్‌కు లాక్ ఉండిఉంటే...

స్కూల్ బస్సు డోర్‌కు లాక్ సరిగా లేని కారణంగా బస్సులో ఉన్న వృద్ధురాలైన ఆయా పోశమ్మ డోర్ లాక్ వేయలేదు. మరోవైపు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును వేగంగా నడపడం వల్ల నిండుప్రాణం బలైపోయింది. విషయం తెలుసుకొన్న తల్లిదండ్రులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న చిన్నారి మృతదేహాన్ని చూసి గుండెవిసేలా రోదించారు. సమాచారం అందుకొన్న ఎస్‌ఐ సైదిరెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్ రామును అదుపులోకి తీసుకొన్నారు. అలాగే బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు షోకాజ్ నోటీసులు

భువనగిరి : లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన బస్సు నుంచి అభిలాష్(6) అనే విద్యార్థి కిందిపడి మృతిచెందిన విషయంపై ఎంఈవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు తదుపరి చర్యల కోసం షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు భువనగిరి డీఈవో కె నారాయణరెడ్డి తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి


నిహాల్ (ఫైల్)

రామన్నపేట: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి బాలుడు మృతిచెందిన ఘటన సోమవారం రామన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణానికి కందుల వేణు మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వేణు సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోనే మరోచోట ఉంటున్న అతడి తండ్రి అంజయ్య వద్ద ఆడుకుంటున్న తన చిన్నకుమారుడు నిహాల్(18 నెలలు)ను బైక్‌పై తీసుకొచ్చి ఇంటి ముందు దింపి పొలం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో నిహాల్ తల్లి ఇంటి పనిలో నిమగ్నమై ఉండగా, అతడు ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందు ఉన్న నీటి సంపులో పడి మృతిచెందాడు. అరగంట తర్వాత ఇంటికి వచ్చిన వేణు సోదరుడు శ్రీను సంపులో పడి ఉన్న నిహాల్‌ను గమనించి బయటకు తీశాడు. స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బాలుడిని తల్లిదండ్రులను పరామర్శించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- నగదు, బంగారం అపహరణ

రాజాపేట: తాళం వేసి ఉన్న గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగదు, బంగారం అపహరించిన సంఘటన మండలంలోని దూదివెంకటాపురం గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూదివెంకటాపురం గ్రామానికి చెందిన గొడిశెల ఉపేందర్ తన తల్లిదండ్రులతో కలిసి ఆదివారం పనిమీద పారుగూరికి వెళ్లాడు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో దాచిన రెండు బంగారు చైన్లు, ఒక ఉంగరం, కొంత నగదు చోరీకి గురైందని గుర్తించిన ఉపేందర్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లిన దొంగలు

చౌటుప్పల్: రోడ్డు వెంట నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం శివారులో అద్దెకు ఉంటున్న భవస్ పాటిల్ పట్టణ శివారులోని శ్రీని పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీ ముగిశాక కంపెనీ నుంచి బయటకు వచ్చి హైవే వెంట నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతడిపై దాడి చేసి పర్సులో ఉన్న రూ.3100 నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కోని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం

- రూ.4లక్షల వరకు ఆస్తి నష్టం


సూర్యాపేట క్రైం: విద్యుదాఘాతంతో ఇంట్లోని వస్తువులు దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి పట్టణంలోని జమ్మిగడ్డలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మిగడ్డకు చెందిన తోట భారతమ్మ, కుమారుడు విజయ్‌కుమార్ ఒకే ఇంట్లో వేర్వేరు గదుల్లో నివాసం ఉంటున్నారు. కాగా రోజు మాదిరిగానే విజయ్‌కుమార్ దుకాణానికి వెళ్లాడు. తల్లి భారతమ్మ ఇంటికి తాళం వేసి సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ అయ్యి ఇంట్లో నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు వచ్చాయి. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే విజయ్‌కుమార్, భారతమ్మకు విషయం తెలియజేశారు. వారు వచ్చి చూసేసరికి ఇంట్లోని మూడు కుట్టు మిషన్‌లు, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఇంట్లో గ్యాస్‌కు మంటలు అంటుకోగా, స్థానికులు ఇంటి పైకప్పు రేకులను పగులగొట్టి నీళ్లు పోయడంతో పెనుప్రమాదం తప్పింది. ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేయడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.4లక్షలు వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


నియామకపత్రం అందజేస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్

నల్లగొండ రూరల్: ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేయాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ బోళ్ల వెంకట్ ముదిరాజ్‌ను నియమిస్తూ సోమవారం హైదరాబాద్‌లో ఉత్తర్వులు అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ముదిరాజ్‌లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన నాయకులు వెలుగు రవి, ఈదుల యాదగిరి, శ్రీను, బాలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

11వ రోజుకు చేరుకున్న నాటక పోటీలు


విజయనిరుద్ధం పద్య నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు సోమవారం 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ పోటీలను ఆలయ ప్రధాన పూజారి కారంపూడి రాఘవాచార్యులు, మిర్యాలగూడ సాంస్కృతిక కళావేదిక మాజీ అధ్యక్షుడు గ్యార సాయిలు, మాజీ ప్రధాన కార్యదర్శి ఏవీఎస్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వరంగల్ స్టార్ బ్రదర్ సాంస్కృతిక కళాపరిషత్ వారిచే ప్రదర్శించబడిన విజయనిరుద్ధం అనే పద్య నాటకం చూపరులను ఆకట్టుకుంది. మంగళవారంతో ఈ జాతీయ స్థాయి నాటిక పోటీలు ముగియనున్నాయి.

జీవశాస్త్రం టీచర్ జాతీయ స్థాయికి ఎంపిక


విద్యార్థులకు సూక్ష్మదర్శిని గురించి వివరిస్తున్న ఉపాధ్యాయురాలు పవిత్ర

గరిడేపల్లి: విద్యా అమృత్ మహోత్సవంలో భాగంగా ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నూతన బోధనా పద్ధతులపై 2022 సెప్టెంబరులో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో గరిడేపల్లి మండలం గడ్డిపల్లి పాఠశాలకు చెందిన జీవ శాస్త్రం ఉపాధ్యాయురాలు మారం పవిత్ర జాతీయ స్థాయిలో రెండవ స్థానానికి ఎంపికయ్యారు. నూతన బోధన పద్ధతులపై ఐదు నిమిషాలు నడివిగల వీడియోను రూపొందించి దీక్షలో పోర్టల్ అప్‌లోడు చేసినట్లు ఆమె తెలిపారు. తాను రూపొందించిన ఈ డిజిటల్ మైక్రోస్కోప్ ధర రూ.1800 మాత్రమేనని చెప్పారు. ప్రస్తుతం పాఠశాలలో ఉపయోగించే సంయుక్త సూక్ష్మదర్శిని రూ.6వేల వరకు ఉంటుందని, దీని ద్వారా ఒక్క విద్యార్థి ఒక్కసారి మాత్రమే సంయుక్త సూక్ష్మదర్శిని పరిశీలించాలంటే స్లయిడ్ తయారు చేసి శాంపిల్‌ను స్లయిడ్‌పై పెట్టి పరిశీలించినప్పుడు ఎక్కువ సమయం పడుతుందని ఆమె వివరించారు. తాను రూపొందించిన మైక్రోస్కోప్ ద్వారా శాంపిల్స్‌ను కంప్యూటర్ ద్వారా ఎక్కువ మంది చూడవచ్చన్నారు. మైక్రోస్కోప్‌ను ఫోన్ ద్వారా, కంప్యూటర్ ద్వారా కనెక్ట్ చేసుకోవచ్చని తెలిపారు. ఉదాహరణకు కణాలు, పత్రకణాలు, పత్ర రంధ్రాలు, కటకదేహం భాగాలు తదితర వాటిని పరిశీలించవచ్చన్నారు.

నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు


నిరసన దీక్షలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి తదితరులు

భువనగిరి : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. నిరుద్యోగుల కోసం బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని ప్రిన్స్ చౌరస్తా వద్ద బీజేపీ భువనగిరి నియోజకవర్గ కన్వీనర్ చిక్క కృష్ణ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ పట్ల నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరు నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న మంత్రి కేటీఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు చందా మహేందర్ గుప్తా, పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి, పట్టణ అధ్యక్షుడు ఉమాశంకర్ రావు, నీలం రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, కౌన్సిలర్ రత్నపురం బలరాం, నాయకులు భాస్కర్‌రెడ్డి, సీఎన్ రెడ్డి, పంచెద్దుల బలరాం, సుర్వి లావణ్య, సుధాకర్‌గౌడ్, పట్నం కపిల్, అశోక్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం కార్మికులను ఇబ్బందులు పెడుతోంది


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నేషనల్ సీనియర్ సెక్రటరీ, రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌గౌడ్

యాదగిరిగుట్ట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఐఎన్‌టీయూసీ నేషనల్ సీనియర్ సెక్రటరీ, రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌గౌడ్ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం నిర్వహించిన ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, కార్మికుల హక్కులను కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, శ్రామికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ కార్పొరేట్ శక్తులకు మోకరిల్లుతున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో కార్మిక చట్టాలను సాధించుకునేందుకు ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. సుడుగు జీవన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగన్నగౌడ్, ఉమ్మడి రాష్ట్రాల సీనియర్ కార్యదర్శి నర్సింగరావు, నేషనల్ యూత్ వింగ్ సెక్రటరీ చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు భాస్కర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, ఎంపీపీ చీర శ్రీశైలం, మండల అధ్యక్షులు కానుగు బాలరాజుగౌడ్, ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సీస మనోహర్‌గౌడ్, మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మురళి, అసంఘటిత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుండు నర్సింహ, భవన కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు ఆకుల రవి తదితరులున్నారు.